# వెలుగూ-వేడి



నాకు తెలిసిన శకుంతలని పరిచయం చేస్తాను.

సిరిపురం జగన్నాథం పండితులంటే మా సీమలోని నాలుగు జిల్లాల్లోనూ మంచి పేరు. ఆయుర్వేదంలో దిట్ట, అర్చకత్వంలో గురుత్వం వుంది. ఆయన ఏడుగురు సంతానంలో ఆరోపిల్ల శకుంతల. ఎప్పుడూ పూజలూ, పునస్కారాలూ, స్నానాలూ, జపాలూ, మందులూ-మాకులూ సాగిపోయే వాతావరణం అయినా...పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన లౌకికుడు....శకుంతల తండ్రి. ఫలితంగా ఆమె అన్నలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడితే ఆమె బియ్యేదాకా చదువుకొచ్చింది.

ఏడాది క్రితం రామ్మూర్తితో ఆమెపెళ్ళిని తన్నంతలో ఘనంగానే వెళ్ళబుచ్చారు. జగన్నాథంగారు.

కాపరానికొచ్చిన రెండోనెలలోనే భర్త పద్ధతులు, మెట్టినింటి పరిస్థితులూ అవగతమైనై శకుంతలకి. మూడుబెడ్ రూములున్న ఆధునిక భవంతిలో నివసిస్తున్నా ఆమెకు ఆ ఇల్లు ఇరుగ్గానే తయారైంది. ఎప్పుడూ జ్వరం తగిలినట్లే అనిపించసాగింది.

అవ్యక్తమైన అశాంతీ, కోపమూ, ఆవేదనా, ఆందోళనా మొలకెత్తి రోజులు గడుస్తున్నకొద్దీ ఆమెలో అవన్నీ మొక్కలుగా, చెట్లుగా, పెరగసాగినై.

"నాన్న ఎప్పుడూ ఇంతే. ఇప్పుడే పెళ్ళికి తొందరేమిటని అంటే విన్లేదు..." అని తనలో తాను చాలాసార్లు అనుకునేది శకుంతల. వాస్తవం తన పాలకల్ని పక్కకి నెట్టాలని చూస్తున్నప్పుడల్లా సంఘర్షణకిలోనయ్యేదిశకుంతల మనసు.

శకుంతల కథలో ఇప్పుడు జరుగుతున్నది చెప్తాను.

"ఇవతల ముఖ్యమైన విషయాలు మాట్లాడుతుంటే. అలా బెల్లంకొట్టినరాయిలా కూచోడం వాళ్ళపొగరుకి నిదర్శనం."

పెళ్ళాం ఉదాసీనతకి ఉగ్రుడై పోయాడు రామ్మూర్తి.

తక్కున మొహం పక్కకితిప్పి సూటిగా భర్త కళ్ళల్లోకి చూసింది శకుంతల. ఆ చూపుల్లో వేడి రామ్మూర్తికి చురుక్కున తగిలింది.

"నేను మాట్లాడాల్సిందేమీలేదు" అంటూ లేచి తన గదిలోకి నడిచింది శకుంతల.

వమ్మిడీ అంత మొహం చేసుకుని నిల బడిపోయాడు రామ్మూర్తి. ఏం చేయాలో పాలుపోలేదు. కాలూ, చెయ్యీ ఆడలేదు. భార్య సమాధానానికి బిక్కచచ్చిపోయి సోఫాలో కూలబడి గోళ్ళు కొరుక్కుంటూ వుండిపోయాడు. మళ్ళీ అలాగే వుండిపోలేక "తల బిరుసుదనం" అని పళ్ళు కొరికేడు. కాళ్ళు నేలకికొట్టించేడు.

"వట్టి పెంకి ఘటం...." అని మెటికెలు విరిచింది కాంతమ్మ. ఆమె రామ్మూర్తి తల్లి.

తన మీద తనకే జాలి కలిగింది రామ్మూర్తికి. జాలిలో నుంచీ విసుగ జనించింది. "అలు కాదు...నా తలవ్రాలు" తనలో తను గొణుక్కుని నుదుట అరచేత్తో కొట్టుకున్నాడు.

ఆ తర్వాత కొంతసేపు తల్లీకొడుకులు మంతనా లాడుకున్నారు. పక్కగదిలోనే పడుకున్న శకుంతలకి వాళ్ళిద్దరి మంతనా ల్లోని నిర్ణయం అర్థమౌతూనే వుంది.

తన చెల్లెలు వాసంతి పేరున విజయ వాడలో పది సెంట్ల ఇళ్ళస్థలం కొంటున్నాడు రామ్మూర్తి. అదీ ఆ నిర్ణయం!

శకుంతలకి రోషం. ఉక్రోషం ఉక్కిరి బిక్కిరి చేసినై గుండెల్లో పిడుగులుపడి, మనసులోని అసహాయత కళ్ళల్లో వర్షం కురిపించింది.

ఒకగంట తర్వాత...

లేచి మొహం కడుక్కుని వచ్చి అద్దం ముందు నిలబడింది శకుంతల. కళ్ళల్లో కాంతీ, మొహంలో కారుణ్యమూ శరీరంలో లావణ్యమూ వెలిసిపోతున్నట్లు అనిపించింది.

"గోరంతల్ని కొండంతలు చేసుకొని బాధపడుతున్నావా" అని తనను తాను ప్రశ్నించుకుంది. "లేదు లేదు లేదు" అని మనస్సాక్షి సమాధానం చెప్పింది.

మొహాన తిలకం దిద్దుకుని, బుక్ షెల్ఫ్ కేసి నడిచింది. అప్రయత్నంగా ఆమె చేతులు "తనకోసం" మీదికి వెళ్ళినై. మనస్సుని ప్రశాంత పరచడానికి ఆమె పదేపదే చదివే పుస్తకం అది.

సాయంత్రం ఆరుగంటలవుతుండగా పుస్తకం మూసిలేచింది శకుంతల. వంటిం ట్లోకి నడిచింది.

వంటావిడ రుక్మిణమ్మ "టీ ఇవ్వనా అమ్మా" అంటూ ఎదురొచ్చింది. ఆవిడకు శకుంతలంటే అభిమానం.

"నే చేసుకుంటాను" అని తానే టీ కలుపుకుంది. అక్కడే వున్న స్టూలు మీద కూర్చునితాగింది.

వంటగదిని వోసారి కలయ చూసింది శకుంతల. వోపక్కన హాట్ ప్లేట్, వోప క్కన గ్యాస్ స్టవ్, వొక అల్మైరాలో పాతిక మంది భోజనాలకి సరిపడే క్రోకరీ, వెనగ్గా గోడకున్న అరల్లో స్టీలుడబ్బాలూ, గిన్నెలూ, పళ్ళేలూ. ఆ పక్క అరలో మిక్సీ, వోఅరలో నాలుగు సైజుల్లో కుక్కర్లు ఆ పక్కనున్న అరలో మిల్క్ బాయిలర్, చివరగా కాఫీ ఎస్ప్రెసో, గట్టు చివర వాటర్ ఫిల్టర్.

సన్నగా నవ్వుకుంటూ బయటికొచ్చింది. హాల్లోనుంచి నడుస్తుంటే తివాచీసొగసుగా గా పాదాల్ని ముద్దెట్టుకుంటోంది. ఇవాళ అన్నింటినీ వివరంగా చూస్తోంది శకుంతల.

అటూఇటూ సోఫాలు...మధ్య టీపాయ్

....దాని మీద ఖరీదైన ఫ్లవర్ వాజ్, కార్నర్‌లో రక రకాల లతలు చెక్కివున్న ఓ రోజ్‌వుడ్ స్తంభం...దాని మీద అందమైన పూలతో మరిఒక ఫ్లవర్‌వాజ్, గోడల నిండా ప్రకృతి దృశ్యాలతో కూడిన పటాలూ, ఏవేవో కాన్ఫరెన్స్‌ల్లో ఎవరెవరో విఐపీ లతో కలిసి రామ్మూర్తి తీయించుకున్న ఫొటోలూ వున్నై.

దేశంలోని ఫొటోగ్రాఫర్లందరూ కక్ష గట్టి, నిన్నిలాగే జనానికి చూపిస్తాం. అని వొట్టేసుకున్నట్టు, వాటన్నింటిలోనూ రామ్మూర్తి మొహాన్ని సాధ్యమైనంత అసహ్యంగా తీశారు.

హాల్లో మరో మూల ఇంపోర్టెడ్ స్టీరియో అందులోనే రేడియో కూడా వుంది. దాని ముందు సోఫాలో కూర్చునిదానిలో నుంచి వస్తున్న ఏదో సంగీతాన్ని వింటూ తల ఆడిస్తోంది శాంతమ్మ. శకుంతల రాకని గమనించి మొహం పక్కని తిప్పుకుంది ఆవిడ.

ఆమె ముఖ కవళికలని గమనించి ముందుకు సాగింది శకుంతల.

హాలు దాటితే వసారా. వసారాలోంచి క్రిందికి మెట్లు. క్రింది వసారాముందు పోర్టికో, పోర్టికో బయటలాన్, గార్డెన్ క్రిందిభాగంలో ఇంటివాళ్ళున్నారు. బయటికి వచ్చేసింది శకుంతల. లాన్‌లో కూర్చుంది.

పశ్చిమాన సూర్యుడు ఉరిపోసుకుంటున్నాడు. ఆశయ సాధనలో వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగానా ? ఏమో ? అలాఎందుకనుకోవాలి ? తన కర్తవ్యం నిర్వహించిన తృప్తితో విశ్రాంతి తీసుకోబోతున్నాడేమో?

శకుంతల ఏకాంతాన్ని భంగం చేస్తూ ఇంటివాళ్ళ అమ్మాయి ఇందిర వచ్చింది. శకుంతల ఎదురుగా కూర్చుంది. పిచ్చాపాటీలో పడ్డారిద్దరూ. క్షణాల తర్వాత అడిగింది, ఇందిర. 'అక్కా....నువ్విలా ఏదో పోగొట్టుకున్నదానిలా వుంటావెందుకు?'

శకుంతల ఊహించని ప్రశ్న ఇది అయినా నిభాయించుకుని సమాధానం చెప్పింది, "నాకు పెళ్ళయిందిగా" అని

ఇందిరకు అర్థంకాలేదు. అయోమయంగాగా శకుంతల కేసి చూసింది.

సన్నగా నవ్వింది శకుంతల.

"అయితే నే పెళ్ళి చేసుకోను" ఠక్కున అని చీరకొంగు మెలిపెడ్తూ బుంగమూతి పెట్టింది ఇందిర.

శకుంతల గతుక్కుమంది. తికమక పడింది కూడా. మెదడులోఏవో ఆలోచనలు ప్రవహించసాగినై. రైలుపెట్టెలో కిటికీ పక్కగా కూర్చుని బయటికి చూస్తున్నట్లనిపించసాగిం అక్కడ. ఆ తర్వాత నిశ్శబ్దం ముద్దకట్టింది.

ఏడుగంటలు దాటు తుండగా వచ్చాడు రామ్మూర్తి. అలికిడివిని స్పృహలోకొచ్చింది శకుంతల. ఎదురుగా ఇందిరలేదు. తన ఆలోచనల్లో ఆమె ఎప్పుడు లోపలికి వెళ్ళిపోయిందో తాను గమనించనేలేదు. నెమ్మదిగా లేచి లోపలికి వచ్చేసింది.

రామ్మూర్తి వెనకాలే బండివాళ్ళు ఒక పెద్ద కర్రపెట్టెని తెచ్చి హాల్లో వోమూలగా వుంచి ఊడదీయసాగారు. ఫ్రిజ్ అది !

శాంతమ్మ మొహం చాటంత అయింది. కొడుకుని వివరాలు అడుగుతూ సంతృప్తి నిండిన కళ్ళతో అతని కేసి గర్వంగా చూస్తూ కూర్చుంది.

డ్రెస్ ఛేంజ్ చేసుకొచ్చి సోఫాలో కూర్చున్నాడు రామ్మూర్తి.

కాఫీతెచ్చి ఇద్దరికీ ఇచ్చింది శకుంతల.

"ఎక్కడ పెట్టిద్దాం దీన్ని?" భార్యకేసి చూస్తూ అడిగేడు రామ్మూర్తి....కాఫీ సిప్ చేస్తూ.




"రాత్రి చెప్పానుగా" అని తక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది శకుంతల.

రామ్మూర్తికి పాలమారింది. కళ్ళు చెమ్మగిల్లినై. తల్లి అరచేత్తో మాడుమీద చరుస్తూ, ఏదో గొణగసాగింది.

భార్య సమాధానం నుంచి చాలాసేపటి దాకా కోలుకో లేకపోయాడు రామ్మూర్తి.

ఫ్రిజ్‌ని పూర్తిగా సర్దుతుండగా భార్యని మళ్ళీ పిలిచేడతను. ఆమె రాలేదు. రుక్మిణమ్మ వచ్చి 'శకుంతల స్నానం చేస్తున్నదని' చెప్పింది.

తల్లీకొడుకులు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. చివరికి వంటగది తలుపు పక్కగా హాల్లో నిలబడింది ఫ్రిజ్.

శాంతమ్మ దాన్ని అక్కడా ఇక్కడా స్పృశించీ, తాకీ, తెరిచీ, మూసీ, కొట్టీ, పట్టుకునీ మురిసిపోయి ముసి ముసినవ్వులు నవ్వుకుని ఆనందించింది. కొడుకుని మెచ్చుకుంటూ "నా కొడుకు ప్రయోజకుడైనాడు" అని తనలో తాను చాలాసార్లు అనుకుంది.

ఫ్రిజ్ తెచ్చిన వాళ్ళని పంపేసి లోపలి కొచ్చేడు రామ్మూర్తి. తల్లి ఆనందం చూసిన అతని మనస్సు సంతృప్తితో నిండిపోయింది.

"నే చెప్తినే....వాడి కసలు తృప్తిగా లేదమ్మా. ఇదెందుకుసార్. ఇంకేదైనా ఆలోచించండి.... అని మధ్యాహ్నం దాకా వొకటేరొద. ఈసారి చూడాలి." తల్లి దగ్గరగా వస్తూ అన్నాడు రామ్మూర్తి.

"అవున్లేరా వాడి ఆనందం వాడిది. ఈసారి ఇంకో విలువైన వస్తువేదైనా చూసి అడుగుదాంలే" ఆవులిస్తూ సోఫాలో వెనక్కు వాలింది శాంతమ్మ.

నెమ్మదిగా కదిలి శకుంతల గదిలో కొచ్చాడు రామ్మూర్తి. "నీ పద్ధతేం బావు లేదు" అంటూ మంచంమీద కూర్చున్నాడు.

"అవును" అంటూ చీరకుచ్చెళ్ళు సరి చేసుకుని కుర్చీలో కూర్చుంది శకుంతల.

"అంటే ?...." రెట్టిస్తూ విషయాన్ని సాగదీయటం మొగలెట్టాడు రామ్మూర్తి.

"చెప్పాను గదా....మీ పద్ధతేమీ బావు లేదు."

"అది నేననే మాట."

"నా మాటా అదే"

పరాభవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు రామ్మూర్తి. 'అంటే...నీ సత్యాగ్రహం...'

"అవును....సాగుతుంది. దాన్ని మాన్పిం

చడానికి మీరేం చేస్తున్నారు కనుక. పైగా అగ్నికి ఆజ్యాన్నితోడు చేస్తున్నారు."

రామ్మూర్తికి ఏడుపు ముంచుకొస్తోంది. "సరే....అయితే...." అని ఠక్కున లేచి గబగబా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ వెంటనే అతని గది తలుపులు శబ్దం చేస్తూ మూసుకున్నై.

శకుంతలకి బాధా, ఆవేదనా కలిగినై. ఆ తర్వాత కొద్దిసేపటికి మనస్సుని చిక్కపట్టుకుని టేబుల్‌లోని కవరునీ, కవరులోని కాగితాల్నీ చేతిలోకి తీసుకుంది.

ఇది జరిగిన పదిపదిహేనురోజుల్లోనే ఆ వూరికి టీ.వీ. రిలేస్టేషన్ వచ్చింది. ఆ వేళ కార్యక్రమాల ప్రారంభదినం.

సాయంత్రం నాలుగవుతుండగా టాక్సీలో టి.వి తెచ్చాడు రామ్మూర్తి. మరో అర్ధగంటలో యాంటెనా ఫిక్స్ చేయించడం పూర్తయింది.

కార్యక్రమాల ప్రసారం మొదలైంది.

"ఎంత ఇష్టం లేకపోయినా, ప్రోగ్రామ్‌ని చూడొచ్చు" యధాలాపంగా భార్యనుద్దేశించి అన్నాడు రామ్మూర్తి.

ఆమె హాల్లో వోమూల కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటోంది.

"సయించని పాయసాన్ని ఆరగించే అవస్థ నాకు అక్కర్లేదు" అని అక్కణ్ణుంచి కదిలింది శకుంతల.

పళ్ళు కొరుక్కున్నాడు రామ్మూర్తి. శాంతమ్మ మూతి పదహారు వంకర్లు తిప్పి 'ఛణపెంకి' అన్నది.

రాత్రి...ఒంటిగంట యింది.

ఉలిక్కిపడి లేచింది శకుంతల.

"పాడు పీడకల" అనుకుని మళ్ళీకళ్ళు మూసుకోబోతూ పక్కమంచం కేసి చూసింది. రామ్మూర్తి లేడు.

మంచందిగి నెమ్మదిగా గది బయటికి వచ్చింది. హాల్లో రుక్మిణమ్మ నిద్రపోతోంది. శకుంతల అడుగులు సాగినై. వంటగది పక్కగా వున్న శాంతమ్మ గదిలో సవ్వడి వినపడింది. ఆగి, ఊపిరి బిగపట్టి కిటికీ పక్కగా నిలబడింది. తలుపు కంతలోంచి సన్నగా వెలుగు బయటకు ప్రసరిస్తోంది. జాగ్రత్తగా ఆ ఖాళీలోంచి ఒంటికంటితో లోపలికి చూసింది శకుంతల.

రామ్మూర్తి....శాంతమ్మ....వారిముందు నగలు, డబ్బు....! !

శకుంతలకి పెదవులు పొడారిపోయినై. ఇంట్లో అంతడబ్బూ, అన్ని నగలూ వున్న విషయం ఆమెకు తెలియనే తెలియదు. సన్నగా మాటలు వినబడటంతో ఆశ్చర్యంలోంచి తేరుకుని జాగ్రత్తగా వినసాగింది.

"ఇల్లు కట్టుకుందాంరా అబ్బాయ్"

"ఇప్పుడే కాదులేవే. కొన్నాళ్ళుపోనీ. ప్రస్తుతానికి వీటిని వాసంతి దగ్గరపెట్టినా" నగలూ డబ్బూ వుంచిన పెట్టెను శాంతమ్మ మంచం దగ్గరగా బోషాణంలో వుంచి, పైన సామాను సర్దేస్తూ అన్నాడు రామ్మూర్తి.

అతను వస్తున్న సవ్వడివిని చప్పుడు కాకుండా కదిలి తనగదిలోకి వచ్చేసింది శకుంతల.

కొద్దిసేపట్లోనే తన మంచం మీదికి వాలాడు రామ్మూర్తి, నిద్రపోతున్న భర్తను చూస్తూ పడుకుంది శకుంతల. ఆపైన ఆలోచనల్లోనే ఆమెకు తెల్లవారింది.

ఉదయం తొమ్మిది గంటలవుతుండగా టెలిగ్రామ్ వచ్చింది. జగన్నాధంగారు పోయారు.

రాత్రి పీడకలకి కారణం తెలిసింది శకుంతలకి. వెంటనే ప్రయాణమై పుట్టింటికి బయల్దేరింది.

బస్‌స్టాండులో—

రామ్మూర్తి భార్య కళ్ళల్లోకి ప్రాధేయ పూర్వకంగా చూస్తూ, "నువ్ తిరిగిరావడం నా శకూగా వస్తావని ఆశిస్తున్నాను." అన్నాడు.

శకుంతల ఏం మాట్లాడలేదు.

బస్ బయల్దేరింది.

రామ్మూర్తి అడుగు పక్కకి వేస్తుంటే అప్పుడు అన్నది శకుంతల... "మీరూ నా వారు కావచ్చుగా..." అని.

బస్ వెళ్ళిపోయింది. మెడమీద మిడత పడ్డట్టనిపించింది రామ్మూర్తికి.

జగన్నాథంగారి దినవారాలు ... పెద్ద వాళ్ళ చావుపెళ్ళితో సమానం అన్నట్టు... జరిగినై. ముగ్గురు అక్కలూ, బావలూ ఇద్దరు అన్నలూ వదినలూ....ఎటువాళ్ళు అటు బయల్దేరుతున్నారు.

ఆవేళ....శకుంతలతో ఏవోపిచ్చాపాటీ కబుర్లాడుతూ మూడో అక్క అడిగింది, "ఏం వేం శకూ. మీ ఆయన దోసిళ్ళతో సంపాయిస్తున్నాట్టగా. సువ్వెట్టా దీపపు సెమ్మెలా నవ్వావేం ?" అని.

"ఏం...మీ ఆయనకి తక్కువగావుందా?" అని ఎదురు ప్రశ్నవేసింది శకుంతల. అతనూ, రామ్మూర్తీ ఒకే ప్రభుత్వశాఖలో పన్జేస్తున్నారు. కాకుంటే రామ్మూర్తి మధ్య తరగతి ఆఫీసరు: శకుంతలబావ కింది తరగతి గుమాస్తా.

"ఏంవిటే అ పెడసరపు సమాధానం" అని మొహం చిన్నబుచ్చుకుని, "ఎరక్క పోయి అడిగేను" అని వెళ్ళిపోయింది.

శకుంతల చిన్నన్న ఆమె దగ్గరికొచ్చి, "రామ్మూర్తికి మంచి పలుకుబడి వుందని తెలిసింది. మీమేనల్లుణ్ణి ఏదైనా ఉద్యోగంలో పడేస్తాడేమో చెప్పవే...." అని అడిగేడు.

"వాసుని ఇక్కడే వుంచివెళ్ళు మన సత్యంతో పాటు ఉంటాడు. ఉద్యోగాల సంగతి తరువాత చూద్దాం" అంది

సత్యం శకుంతల తమ్ముడు. డిగ్రీ ఫస్టియర్‌లో వున్నాడు. వాసుది కూడా అదే వయస్సు ఏం వనుకున్నాడో ఏమో ... వెళ్తూ వెళ్తూ కొడుకుని తనతో తీసుకునే వెళ్ళాడు ఆయన.

ఖాళీస్టేషన్‌లా మిగిలింది ఇల్లు.

నెలరోజులు యాంత్రికంగా గడిచి పోయినై.

ఒకరోజుమధ్యాహ్నం....తను ఆశిస్తున్న ఉత్తరాన్ని అందుకుంది శకుంతల. ఇకతను ఒకరి మీద ఆధారపడవలసిన పనిలేదు.

ఆ రాత్రంతా ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది.

మర్నాడు రామ్మూర్తికి ఉత్తరం రాసి పోస్ట్ చేసేసింది.

శకుంతల జాబు చూసిన రామ్మూర్తి తల్లక్రిందులయినాడు. గుండెదిగపట్టి, నాలిక పిడచకట్టి, పెదవులు ఎండిపోయినై కింకర్తవ్యతా మూఢత్వం ఆవరించి అమూ వాస్యలా అయిపోయాడు. ఆలోచనలుపిరికివి కావడంవలన అయోమయాన్ని సృష్టించాయి.

శాంతమ్మ సరేసరి. ఏడేడుతరాలూ శాప నార్థాలు పెడ్తూ, తిట్లదండకాలు వల్లిస్తూ చిందులు తొక్కింది.

వారం తిరిగేసరికి శకుంతల ముందు వాలేడు ..రామ్మూర్తి.

పరామర్శలయినై. భార్య గదిలోకి వచ్చాడు.

అక్కడ శాంతి వాతావరణం చల్లగా కమ్మ తెమ్మెరలా వుంది.——

'కూర్చోండి....' శకుంతల గొంతులో నిబ్బరం! నిశ్చలత్వం ఆమె సముద్రమంత గంభీరంగా వుంది. రేడియోలో ఎవరో గాయని మంద్రస్వరంలో చెరకురసంలా గాన మాధుర్యాన్ని స్రవిస్తోంది.

గొంతు పెగుల్చుకుని సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు మొదలెట్టేడు రామ్మూర్తి. 'నా పరిస్థితి అర్థం చేసుకో శకూ. నేనుగా కావాలని ఎవర్నీ ఏమీ అడగను. మాడిపార్టుమెంటు అలవాట్లూ ఆ చారాలూ అలా వచ్చినై. నేను మడి కట్టుకూర్చున్నా బతకనివ్వరు.' అని 'ఓహ్....పిచ్చి పుడుతోంది. నిజానికి చెప్పాలంటే నెల తిరిగే సరికి వచ్చే ఆ ఆదాయాన్ని ఏం చేయాలో తెలీడం లేదు. మతిపోతోంది నాకు' ఆగేడు.

శకుంతల భర్త కళ్ళల్లోకి తీక్షణంగా చూసింది.

రామ్మూర్తి తలవంచుకున్నాడు. క్షణాల తర్వాత సన్నగా అన్నాడు. "చిలికి చిలికి గాలివానలా చెయ్యకుప్లీజ్..."

"నాకెలాంటి దురాలోచనలూ లేవు. పైగానాకాపరం నాకూ తియ్యనైనదే. నా సంసారాన్ని నేనూ స్వర్గంగా చేసుకోవాలనే నా కోరిక కూడా. మీకు రాశాను కదా. నేనిప్పుడు బాధ్యత కలిగిన ఉద్యోగినిని కూడా. ఇక ఏం చేయాలో నిర్ణయించుకోవలసింది మీరే. నా దృక్పథం సరియైన దేనని నేను వాదించటంలేదు. కానీ, అది మన మనసులకి నీడనూ, చల్లదనాన్నీ ఇస్తుందనే నమ్మకం నాకున్నది. ఇక మీ ఇష్టం." ఏమంటారన్నట్టుగా అతని వంక చూసింది శకుంతల.

శకుంతల ప్రతిమాటనూ శ్రద్ధగా విన్నాడు రామ్మూర్తి. అతని మనసు ద్వైదీ భావంతో ఊగుతోంది. తలఎత్తి ఆమె వంక సాలోచనగా చూసేడు.

పై మెట్టు మీద వుంది శకుంతల. తాను కింది మెట్టు మీద ఉన్నాడు. బలమూ, బలహీనతా మధ్య ఊగులాటలో పడ్డాడు. అతని మనసంతా అలజడికిలోనైంది.

శకుంతల మాత్రం స్వామి ముందువేసిన సాంబ్రాణి ధూపంలా వుంది.

o o

ఇదీ జరిగింది.

రామ్మూర్తి ఆ తర్వాత ఏం చేశాడనేది నిఖరంగా చెప్పాలనుకోవడం లేదునేను.

శకుంతల ఆదర్శానికి జోహారుగానే, నేను ఆమె కథ చెప్పాను. ఆదర్శాన్ని కలిగివుండటం వేరు; ఆ ఆదర్శాన్ని ఆచరించాలంటే కావలసిన మానసికమైన సత్తువని సంపాదించుకోవడం వేరు.

శకుంతలలోని ఈ గుణం ఆమెని ఈ కథకే కాదు....రాచపుండుతో బాధపడుతున్న ఈ వ్యవస్థకే నాయకురాల్ని చేసింది.

శక్తివంతమైన దీపపు వెలుగు సముద్ర మధ్యంలో అంధకారంలో కొట్టుమిట్టాడే వ్యక్తికి మార్గదర్శిని కాక ఏమౌతుంది?

శకుంతల ఆ వెలుగు !!

మరి ఆ వ్యక్తి...రామ్మూర్తి !! ✱

---

క్రికెట్ ఛాంపియన్ డాక్టర్ W.G. గ్రేస్ ఓసారి ఊళ్ళో ఆడుతున్న స్పెషల్ మాచ్‌లో ఆడటానికి వప్పుకున్నాడు. అతను బాటింగ్ చేయడానికి వచ్చి నిలబడగానే మొదటి బాల్‌కే అవుటయిపోయాడు. అయినా అతను బాటింగ్ ఆపలేదు.

"ఈ జనమంతా నేను బాటింగ్ చేస్తూంటే చూడ్డానికొచ్చారు. నువ్వు బౌలింగ్ చేయటం చూడ్డానికి కాదు–" అన్నాడతను బౌలర్‌తో. ●